క్లుప్తంగా

అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరీక్షణ



కార్యాలయం ఎదుట బాధిత కుటుంబాలు

కాగజ్‌నగర్‌టౌన్: పెంచికల్‌పేట్ మండలంలో ఇటీవల పెద్దపులిని హతమార్చిన కేసులో పలువురు అనుమానితులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. పెంచికల్‌పేట్ మండలం అగర్‌గూడ గ్రామానికి చెందిన నిందితుల కుటుంబ సభ్యులు గురువారం రాత్రి పట్టణంలోని ఫారెస్టు కార్యాలయానికి వచ్చారు. తమవారు ఎక్కడ ఉన్నారని ఫారెస్టు అధికారులను ప్రశ్నించారు. 'వస్తారమ్మ ఇక్కడే ఉండండి' అని అధికారులు చెప్పడంతో అర్ధరాత్రి దాటినా వారు అక్కడే నిరీక్షించారు. తమవారిని ఎక్కడకు తీసుకెళ్లారో వెంటనే చెప్పాలని మహిళలు కార్యాలయం ఎదుట బైఠాయించారు. జిల్లా కేంద్రానికి రావాలని అటవీశాఖ అధికారులు ఒత్తిడి తెస్తున్నారని బాధితులు తెలిపారు.

హనుమాన్ జయంతి వేడుకలు



హనుమాన్ చాలీసా పారాయణంలో భక్తులు

రెబ్బెన: మండలంలోని హనుమాన్ ఆలయాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామి విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లోని కోదండ రామాలయంలో హనుమాన్ భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పోటు శ్రీధర్‌రెడ్డి, అంజనేయులుగౌడ్, విలాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌అర్బన్: దస్నాపూర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆరో వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు సంతోష్‌శర్మ, తిరుపతిచారి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.

'మహాసభ విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట జూన్ 9న నిర్వహించనున్న గిరిజన హాస్టల్ వర్కర్ల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హాస్టల్ వర్కర్ల పెండింగ్ వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. నాయకులు కోటయ్య, వసంత్ రావు, దేవి బాయి, రాంబాయి, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్‌హెచ్‌ఎం నిధులు పక్కదారి పట్టిస్తున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు గురువారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తీక్ మాట్లాడారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సబ్ కేంద్రాలకు ఎన్‌హెచ్‌ఎం పథకంలో భాగంగా సామగ్రి కొనుగోలు కోసం వచ్చే నిధులను డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఓ అధికారి పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగ్గురిపై కేసు

లింగాపూర్: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఏప్రిల్‌లో రెండు కంప్యూటర్లు, 12 బ్యాటరీలు, ఒక ప్రింటర్ చోరీ చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జైనూర్ సీఐ రమేశ్ గురువారం తెలిపారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. ఈ క్రమంలో మండల కేంద్రానికి చెందిన జాదవ్ శివకృష్ణ, రాథోడ్ జితేందర్‌తోపాటు నైట్ వాచ్ ఉమెన్ చవాన్ వనితపై కేసు నమోదు చేశామన్నారు. ఇందులో ఇద్దరు యువకులను రిమాండ్ తరలించగా, వనితను స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశామని తెలిపారు.

ఆకట్టుకునేలా..సృజన విరిసేలా!

సర్కారు బడుల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో ప్రగతి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. గతంలో జరిగిన తప్పిదాలను నెమరువేసుకుంటూ రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులను ప్రగతి పథంలో నడిపించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అన్నిచర్యలు తీసుకుంటోంది. ఇందుకు ఈ నెల 20 నుంచి ఉపాధ్యాయులకు బోధన, బోధనేతర అంశాలపై శిక్షణ ఇస్తోంది.

- కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ
- రాబోయే విద్యా సంవత్సరంలో ఏఐ విద్యాబోధన
- సబ్జెక్టుల వారీగా ఆర్‌పీలతో తర్ఫీదు



కెరమెరిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఆర్‌పీ

కెరమెరి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు, సృజనాత్మకతను పెంచేందుకు రాష్ట్ర విద్యాశాఖ చర్యలు చేపట్టింది. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులకు బోధన అంశాలపై మండలాల వారీగా శిక్షణ ఇస్తోంది. పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాల పెంపు, కృత్రిమ మేధ(ఏఐ) బోధన, తల్లిదండ్రుల సమావేశం, తదితర అంశాలపై శిక్షణ కొనసాగుతోంది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని రెండు గదుల్లో 90 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఎనిమిది మంది ఎంఆర్పీలు తెలుగు, ఆంగ్లం, గణితం, ఈవీఎస్, బోధన, బోధనేతర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

సందేహాలు నివృత్తి చేసేలా..

గతేడాది విద్యా ప్రమాణాలను పరిశీలించిన విద్యాశాఖ వారిలోని లోపాలను సరిదిద్దేలా ఆర్పీలకు శిక్షణ ఇచ్చింది. ప్రాథమిక స్థాయిలో తెలుగు, ఆంగ్లంలో అనర్గళంగా చదవడం, చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థుల్లో పట్టు సాధించేలా ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు కానున్న కృత్రిమ మేధ పాఠాలు అందిపుచ్చుకోవడం ఎలా? విద్యార్థుల హాజరు..తల్లిదండ్రుల సమావేశం..ఆకర్షణీయమైన బోధన మెలకువలను నేర్పిస్తున్నారు. బోధనోపకరణాలపై సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

భాషా ప్రభావం..

మండలంలోని అత్యధిక గ్రామాలు గిరిజన ఆదివాసీలకు చెందినవే. దీంతో పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, గోండి, మరాఠి భాషలో మాట్లాడేవారు అధికంగా ఉన్నారు. ఈ కారణంగా కొంత వెనుకబాటుతనం ఉంది. ముఖ్యంగా ఆదివాసీ గ్రామాల్లో విద్యార్థులు తెలుగు భాషను అర్థం చేసుకోవడం కష్టమవుతున్నప్పటికీ ఉపాధ్యాయులు తమదైన రీతిలో బోధన చేసి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏఐ బోధన వీరికి మరింత కష్టతరం కానుంది.

అభ్యసన సామర్థ్యాలు మెరుగు



విద్యార్థుల్లో మానసిక వ్యక్తిత్వం ఆధారంగా బోధన జరగనుంది. వారి మేధస్సును బట్టి ఉన్నతంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. విద్యాసామర్థ్యాలు పెంచేందుకు ఈ శిక్షణ ఎంతో దోహద పడుతుంది.

– రవితేజ, ఎంఆర్‌పీ, ఎంపీపీఎస్, గోయగాం

లోపాలు సరిదిద్దేందుకు..



ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన అందుతోంది. విద్యా విధానంలో చాలా మార్పులు వస్తున్నాయి. మరింత లోతుగా విద్యాసామర్థ్యాలు పెంచేందుకు శిక్షణ ఉపయోగపడుతుంది. లోపాలను సరిదిద్దేందుకు సమర్థంగా బోధించవచ్చు.

– శ్రీధర్, ఎంఆర్‌పీ, ఎంపీపీఎస్, కెలిబి

పకడ్బందీగా శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. టీచర్లు అందరూ సకాలంలో శిక్షణకు హాజరవుతున్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించినప్పుడు ఈ శిక్షణకు సార్థకత ఉంటుంది.

– ఆడే ప్రకాశ్, ఎంఈవో, కెరమెరి

తడిసిన ధాన్యం



బెజ్జూర్: మర్తిడిలో ధాన్యానికి కప్పిన టార్పాలిన్



గుడ్లబోరిలో ఓ ఇంట్లో చేరిన వర్షపు నీరు

బెజ్జూర్: మండలం అంతటా రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు చేపట్టాలని అధికారులకు విన్నవిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కోసం గోనె సంచులను అడిగేందుకు ప్రయత్నించినా అధికారులు సరైన సమాధానం చెప్పడం లేదని వాపోతున్నారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యాన్ని ఎక్కడ ఉంచాలో, ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

కౌటాల: మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా గుడ్లబోరిని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలో వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సాండ్‌గాం, వీరవెల్లి, కౌటాల, ముత్తంపేట, గుడ్లబోరి గ్రామాల్లో వరి పంట నూర్పిడి చేసి ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవకుండా కవర్లు కప్పడానికి రైతులకు తిప్పలు తప్పలేదు. శరవేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. జిల్లాలో మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని అధికారులు ప్రకటిస్తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా కుప్పలపై రైతులు కవర్లు కప్పారు. ప్రతీరోజు వర్షం కురుస్తుండటంతో ధాన్యం కాపాడుకోవటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

కౌటాల: కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. భారీ వర్షానికి ముత్తంపేట కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని గురువారం రాత్రి పరిశీలించారు. ప్రభుత్వం సక్రమంగా ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తెలిపారు. అధికారులు కాలక్షేపం చేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో రాత్రి సమయంలో ధాన్యం వద్ద వెలుతురు కోసం ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగిలి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కుడి చేతికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

భాగ్యరెడ్డి వర్మను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న అశోక్ మహోల్కర్

వాంకిడి: భాగ్యరెడ్డి వర్మను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో భాగ్యరెడ్డి వర్మ 138వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 1888లో జన్మించిన అశోక్ మహోల్కర్ జీవితకాలం దళిత జాతి అభివృద్ధి కోసం పోరాటం సాగించారన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో అంటరానితనం నిర్మూలనకు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ ఉప్రె, శ్యాంరావు, దొండు దుర్గె, రోషన్, లాహుజి, బలవంత్, మహేష్, మారూతి, శివాజీ, సంతోష్, నూతన్, రమేశ్, డిలాజీ, తదితరులు పాల్గొన్నారు.

గణితం, ఈవీఎస్‌పై శిక్షణ



ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఆర్‌పీ

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కొనసాగుతోంది. గురువారం గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై ఎంఆర్‌పీలు శిక్షణ ఇచ్చారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు, అంకెలు, సంఖ్యలు, స్థాన విలువలు, 1, 2 తరగతుల వారికి బోధించే విధానంపై అవగాహన కల్పించారు. ఈవీఎస్‌లో స్వభావం, ఉద్దేశాలు, యూనిట్‌ల అమరిక, అకాడమిక్ స్టాండర్డ్, టీఎల్ఎం గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్‌లు శ్రీధర్, రవితేజ, వినీత్, నరేశ్, క్రాంతి, అరుణ్, కోర్స్ డైరెక్టర్, ఎంఈవో ఆడే ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



రవీంద్రనగర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న తహసీల్దార్ మునావర్ షరీఫ్

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం తహసీల్దార్ మునావర్ షరీఫ్ తనిఖీ చేశారు. కేంద్రంలో ధాన్యం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు తీసుకువచ్చే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. తేమ ఉంటే వారికి సమాచారం ఇచ్చి ఆరబెట్టాలని సిబ్బందికి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సేకరించిన ధాన్యం తరలించడానికి విడతల వారీగా లారీలు ఏర్పాటు చేస్తామన్నారు. శనివారం, సోమవారాల్లో సేకరించిన ధాన్యం తరలించాలని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అసిస్టెంట్ జాఫర్, ఐకెపి సిబ్బంది హిమాన్షు, కుసుమ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్, ఎల్కపల్లి, గొంట్లపేట్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. వర్షాల నేపథ్యంలోకేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. తేమశాతం పరిశీలించి ధాన్యం వెంటనే కాంటా చేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం కోనయ్య, ఏఈవో శ్రీవిద్య, నిర్వాహకులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: నిరుపేదలకు వైద్య సాకర్యం కోసం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పంపిణీ చేశారు. అనారోగ్యానికి గురైన నియోజకవర్గంలోని 40 మందికి చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కెరమెరి మాజీ జెడ్పీటీసీ దుర్పతాబాయి, బీఆర్ఎస్ నాయకులు రవీందర్, శంకరమ్మ, శ్రీధర్, ఆనంద్, అఫ్రోజ్ అలీ, పాల్గొన్నారు.

ఓసీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో పనిచేస్తున్న ఓసీపీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైరిగూడ ఓసీపీని గురువారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ నూతన బదిలీ సర్క్యూలర్‌ను వెంటనే రద్దు చేయాలని అన్నారు. కైరిగూడ ఓసీపీలో పనిచేసే కార్మికుల కోసం గతంలో మూడు బస్సులు ఉండగా.. ప్రస్తుతం రెండు బస్సులు మాత్రమే వస్తున్నాయన్నారు. మూడో బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈపీ ఆపరేటర్ల పదోన్నతులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా, కాలపరిమితి పూర్తయిన వెంటనే పదోన్నతులు కల్పించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని గని ఎస్‌వోఎంకు అందించారు. కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ప్రకాశ్‌రావు, నాయకులు మాధవకృష్ణ, నారాయణ, రామ్మోహన్, రాజేశం, శివకుమార్, ప్రభాకర్, శ్రీనివాస్, కుమార్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లులు అందిస్తాం

కెరమెరి: నిర్మాణ స్టేజిని బట్టి ఇందిరమ్మ బిల్లులను అందిస్తామని హౌసింగ్ ఏఈ రత్నం అన్నారు. గురువారం మండలంలోని కొఠారి, కల్లెగాం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి పిరిసింగుల సతీశ్ ఉన్నారు.

జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా ఏర్పడిన ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా కార్మికులకు గ్రామ పంచాయతీ వేతనాలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. స్పందించిన డిప్యూటీ కమిషనర్ జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లిస్తామని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కార్మికులను యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, ఆసిఫాబాద్ మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మాట్ల రాజయ్య, కార్యదర్శి తోట సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు శంకర్, నగేశ్, ప్రసాద్, ప్రభాకర్, ప్రకాశ్, ఆనంద్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు



రుత్విక్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. ఇటీవల విడుదల జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో మండలంలోని తలోడి గ్రామానికి చెందిన షాడ తిరుపతిరెడ్డి–జ్యోతి దంపతుల కుమారుడు రుత్విక్‌రెడ్డి ఆలిండియాలో 274 ర్యాంక్ సాధించాడు. గురువారం కౌటాలలో రుత్విక్‌రెడ్డిని సన్మానించారు. నాయకులు మధుకర్, భీమయ్య, హన్మంతు, మౌనిశ్, శ్రీనివాస్, మనీశ్, బోయర్ రాధేశ్యాం, సంతోష్, బాపు, రవీందర్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆత్మీయ సభకు తరలిరండి

చింతలమానెపల్లి మండలకేంద్రంలో ఈనెల 25న నిర్వహించే కోనేరు ఆత్మీయ సభకుప్రతి ఒక్కరూ తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కోరారు. మండలంలోని గుడ్లబోరి, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో గురువారం కోనేరు అనుచరులతో ఆయన మాట్లాడారు. గత ఏడాదిన్నరలో సిర్పూర్ నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితులపై సభలో విశ్లేషించనున్నట్లు తెలిపారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో బోధన చేయాలి

- డీఈవో యాదయ్య



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

కాగజ్‌నగర్‌టౌన్: సాంకేతికతను జోడించి బోధన చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఓల్డ్‌లో గురువారం ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆసక్తి కలిగేలా అత్యాధునిక సాంకేతిక పద్ధతులు ఇంటరాక్టివ్ ప్యానెల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధనను వినియోగించాలన్నారు. అనంతరం మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థుల యూనిఫాం కుట్టు కేంద్రాలను పరిశీలించారు. శిక్షణ డైరెక్టర్ శ్రీనివాస్‌చారి, ఎంఈవో వాసాల ప్రభాకర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ ఆబిద్ అలీ, జిల్లా రిసోర్స్‌పర్సన్లు, బాలకిషన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యం పెంపొందించేలా కృషి..

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు నైపుణ్యం పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోర్స్ డైరెక్టర్, ఎంఈవో వేణుగోపాల్ అన్నారు. మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మండలంలోని ఉపాధ్యాయులకు కొనసాగుతున్న ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల గణిత సామర్థ్యాల సాధనకోసం వృత్యంతర శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సింగరేణి సేవలు సద్వినియోగం చేసుకోవాలి



భూమిపూజ చేస్తున్న జీఎం విజయ భాస్కర్ రెడ్డి

రెబ్బెన: సింగరేణి సంస్థ అందిస్తున్న సేవలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి కోరారు. ఏరియాలోని గోలేటిలో రూ.9 లక్షల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేస్తున్న శుద్ధ జల కేంద్రం నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి యాజమాన్యం కట్టుబడి పనిచేస్తోందన్నారు. సీఎస్ఆర్ నిధులతో గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందన్నారు. గ్రామస్తు విన్నపం మేరకు శుద్ధ జల కేంద్రం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. శుద్ధ జల కేంద్రాన్ని మంజూరు చేసిన సీఎండీ బలరాం, జీఎం విజయభాస్కర్‌రెడ్డిలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనా బాషా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఫైనాన్స్ మేనేజర్ రవికుమార్, ఈఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఎస్ అధ్యక్షురాలిగా బొజ్జుబాయి

కెరమెరి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సమాఖ్య ఎన్నికల్లో ఆత్రం బొజ్జుబాయి అధ్యక్షురాలిగా ఎన్నికైంది. మొత్తం 34 వీవోల్లో 12 క్లస్టర్‌లుగా తయారు చేయగా 12 మంది ఎన్నికల బరిలో ఉన్నారు. అధ్యక్షురాలిగా ఆత్రం బొజ్జుబాయి, కార్యదర్శిగా టేకం రాధాబాయి, కోశాధికారిగా వాడై తానుబాయి, సభ్యులుగా చవాన్ స్వేత, పెందూర్ బాదుబాయి, శికారే కౌశాబాయి, కోట్నాక బిజ్జుబాయి, టేకం రాధాబాయి, కరాడే కమలాబాయి, జాదవ్ దేవుకబాయి, ఉప్రి లక్ష్మిబాయి, బూత ఎల్లవ్వ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఏపీఎం జగదీశ్వర్ వ్యవహరించారు.

గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతి



దుర్గం సుజాత (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: గుండెపోటుతో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్నూర్ మండలం రాజన్నగూడకు చెందిన సుజాతకు శ్యాంపూర్ పరిధిలోని గోదరిగూడకు చెందిన రమేశ్‌తో 23 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. శ్యాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న సుజాత(45)కు 12 ఏళ్ల క్రితం పదోన్నతి పొంది కుమురం భీం జిల్లాకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న సుజాత గురువారం గోదరిగూడకు ఆర్టీసీ బస్సులో పయనమయ్యారు. జైనూర్ సమీపాన చేరుకోగా గుండె నొప్పి వస్తుందని తెలపడంతో తోటి ప్రయాణికులు ఉట్నూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది.